కోడూరు పొలం సుబ్బారావుపేట వద్ద సెజ్ భూముల్లో జేసీబీతో జరుగుతున్న తవ్వకాలు

సెజ్ భూములను తవ్వేస్తున్నారు..!

◆ యథేచ్ఛగా అక్రమార్కుల మట్టి తవ్వకాలు

◆ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల పరిధిలోని కోడూరు రెవెన్యూ పొలంలో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. కోడూరు నుంచి సుబ్బరావుపేటకు వెళ్లే దారి పక్కన ఎపిఐఐసి ద్వారా లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో ఎస్ఇజెడ్‌కు గతంలో భూములు తీసుకున్నారు. ఈ భూముల్లో సోమవారం నాడు కొందరు అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. జెసిబిలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండకుండల్లా మారాయి. దీంతో మట్టి ఎక్కడా లభించకపోవడంతో గిరాకీ పెరిగింది. దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.400 నుంచి రూ.800 వరకు అమ్ముతున్నారు. ఒక్కో టిప్పర్ రూ.2500 నుంచి రూ.3500 వరకు ధర పలుకుతోంది. ఇళ్ల నిర్మాణాలు, ఇతర అవసరాలకు మట్టికి గిరాకీ బాగా పెరిగింది. దీనిని అదునుగా చేసుకుని కొంత మంది గుత్తేదారులు సిండికేట్‌గా మారి స్థానికంగా ఓ ప్రజా ప్రతినిధి అండదండలతో సెజ్ భూముల్లో అక్రమ తవ్వకాలకు తెరలేపారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వి, ప్రజలకు మాత్రం వేలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. కోడూరు రెవెన్యూ పొలం మొరంపల్లి సమీపంలోని హబ్ భూముల్లో తవ్వకాలు చేపట్టి టిప్పర్ల ద్వార ఎర్రమట్టిని వందలాది లోడ్లు గ్రానైట్ పరిశ్రమల వద్ద కుప్పలుగా తోలుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించక పోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ అక్రమ తరలింపులో వారికీ వాటాలున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైన రెవెన్యూ, మైనింగ్, ఎపిఐఐసి, విజలెన్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొరంపల్లి గ్రానైట్ పరిశ్రమ వద్ద డంప్ చేసిన మట్టి

డ్రైవింగ్ పరీక్ష తికమక..!

◆ టెస్టింగ్ ట్రాక్‌లో గందరగోళం

◆ పరీక్షలో ఫెయిలే అధికం

◆ కొన్ని సాంకేతిక సమస్యలు, కొన్ని అవగాహన లోపాలు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం రవాణా శాఖలో కొత్తగా రూపొందించిన సైంటిఫిక్ టెస్టు డ్రైవింగ్ ట్రాక్‌లో తికమక పరిస్థితులు నెలకొన్నాయి. ఈ డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యే వారిలో ఫెయిల్ అయ్యేవారే అధికంగా ఉంటున్నారు. కొన్ని అవగాహన లోపాలు, కొంత సాంకేతిక సమస్యలు కలిపి డ్రైవింగ్ పరీక్ష ఒక పెద్ద సవాల్‌గా మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా డ్రైవింగ్ టెస్టు ట్రాక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొట్టమొదటిసారి అనంతపురం నగరంలోని రవాణా శాఖ కేంద్రలో ఏర్పాటైన ఈ ట్రాక్‌ను డిసెంబరు 19వ తేదీ నుంచి ప్రారంభించారు. అప్పటి నుంచి 31వ తేదీ వరకు జరిగిన డ్రైవింగ్ టెస్టులు, అందులో ఉత్తీర్ణులైన శాతం చూస్తే ఎక్కువ మంది ఫెయిల్ అయిన వారే ఉండటం గమనార్హం.

ఎల్‌ఎంవిలో 23 శాతమే ఉత్తీర్ణత

ఆధునీక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన టెస్టు ట్రాక్‌లో మలుపుల్లో సెన్సార్లు, వీడియో రికార్డింగ్ అన్నీ ఉంటాయి. ఎక్కడ తప్పు చేసినా సెన్సార్లు వెంటనే గుర్తిస్తాయి. అంతా ఆటోమెటిక్‌గా డ్రైవింగ్ టెస్టు జరుగుతుంది. గతంలో లాగా మోటర్ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టరు పరీక్షించి ఆయన సంతృప్తి చెందితే పాసు చేసేవారు. పూర్తిగా వారి చేతుల్లో ఉండేది. కాని ఇప్పుడు ఆటోమెటిక్ టెస్టు ట్రాక్‌లో డ్రైవింగ్ చేసే వారు ఎక్కడ తప్పు చేసారన్నది అదే గుర్తించి, ఆయన బాగా చేసుకుంటే పాసు లేకపోతే ఫెయిల్ అని కంప్యూటర్ ద్వారానే చేస్తుంది. ఈ రకంగా చూస్తే ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే వారి కంటే ఫెయిల్ అయిన వారే ఎక్కువగా ఉంటున్నారు. డిసెంబరు 19 నుంచి డిసెంబరు 31 వరకు జరిగిన డ్రైవింగ్ పరీక్షల వివరాలు చూస్తే ద్విచక్ర వాహనానికి లెసెన్స్ కోసం డ్రైవింగ్ పరీక్షకు హాజరైన వారు 196 మంది అయితే పాస్ అయిన వారు 147 మంది, ఫెయిల్ అయిన వారు 49 మంది. మొత్తంగా చూస్తే 75 శాతం పాస్ అయ్యారు. ఇక ఎల్ఎంవి (లైట్ మోటర్ వెహికల్) లైసెన్స్ కోసం 168 హాజరయితే మొత్తం 129 ఫెయిల్ అయ్యారు. కేవలం 39 మంది మాత్రమే పాస్ అయ్యారు. అంటే మొత్తంగా 23 శాతం మాత్రమే డ్రైవింగ్ పరీక్షల్లో పాసయ్యారు. ఇక హెవి లైసెన్సు కోసం 24 హాజరయితే తొమ్మిది మంది పాస్ అవగా 15 మంది ఫెయిల్ అయ్యారు. హెవీలో 37.5 శాతం పాస్ అయ్యారు. ఈ రకంగా నాలుగు చక్రాల వాహన డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణులై డ్రైవింగ్ లెసెన్సు పొందటం పెద్ద సవాల్‌గా మారింది.

కొంత గందరగోళం ...కొంత సాంకేతిక సమస్యలు

కొత్త విధానం కావడంతో కొత్తగా డ్రైవింగ్ నేర్చుకున్న వారు టెస్టు ట్రాక్ మీద డ్రైవింగ్ చేసే సమయంలో కొంత వరకు గందరగోళ పడుతున్నారు. దీంతో ఎక్కడ ఏ చిన్న తప్పు చేసినా పరీక్షలో పాస్ కావడం కష్టమైపోతోంది. మరో సమస్య కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో సాంకేతిక సమస్యలు సైతం వెంటాడుతున్నాయి. కొన్ని చోట్ల సిగ్నల్స్ వద్ద జంపింగ్ అని వస్తోంది. సెన్సార్లలో కొన్ని చోట్ల సమస్యలుండటంతో ఆ తప్పులు డ్రైవింగ్‌లో పాల్గొనే వారిపైనే పడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ముందుగా ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రారంభించే సమయంలో చెప్పినట్టు రికార్డు వీడియోల్లో ఎక్కడ తప్పు చేయడం వలన పెయిల్ అయ్యారన్న వివరాలు ఏవీ వాట్సప్ మెసేజ్‌కు రావడం లేదు. అది వస్తే మొదట తప్పు చేసిన వారు తరువాత దాన్ని అధికమించేందుకు వీలుంటుంది. ఇది లేకపోవడంతో తప్పు ఎక్కడ చేసామన్నది డ్రైవింగ్‌లో పెయిల్ అయిన వారికి తెలియడం లేదు. ఈ సమస్యలను పరిష్కరించి, డ్రైవింగ్ లైసెన్సులు తీసుకునే విధానాన్ని సులభతరం చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

దళిత శ్మశాన వాటికల్లో సమస్యలు పరిష్కరించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు, దళితులు

హిందూపురం : పురపాలక సంఘం వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న దళిత శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. సోమవారం పురపాలక సంఘంలో ఇందిరమ్మ కాలనీ, కొట్నూరు, చైడేశ్వరీ కాలనీ, మోత్కుపల్లిలో ఉన్న శ్మశానాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆయా సచివాలయాల్లో వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు మాట్లాడుతూ 1వ వార్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతోపాటు ఇప్పటికే సామాజిక పింఛన్లు వస్తున్న వారికి అనర్హత పేరుతో తొలగించడం అన్యామన్నారు. ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జిఓ 142 ప్రకారం 45 రోజుల్లో శ్మశాన వాటిక ఇవ్వాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్‌లో భాగంగా 12, 35 జిఓ ప్రకారం మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. ఆయా జీవోలను అనుసరించి శ్మశానం లేని గ్రామాల్లో శ్మశానం కల్పించడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కెవిపిఎస్ నాయకులు రామంజప్ప, మూర్తి, నారాయణప్ప, మంజు, చౌడేశ్వరి కాలనీ నారాయణప్ప, కదిరప్ప, లోకేష్, నాగేష్, నారాయణ, శీనా తదితరులు పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

బత్తలపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశు మరణాలను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి తేజశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే పోషకాహారం కోసం పప్పులు, గోధుమలు, రాగులు, చిలకడ దుంపలు, పచ్చని ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువ దూరం నడవడం, ఒకేచోట కూర్చోవడం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి

తలుపుల : సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వేపమానపేట, సచివాలయ పరిధిలోని గంజివారిపల్లి, బోయపల్లి, గుర్రం గుండ్లపల్లి, సింగనపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి ఇచ్చాక కుల, మతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మల్లికార్జున, ఎంపిపి మహమ్మద్ రఫీనాయక్, జెడ్పీ వైస్‌ఛైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచులు పురుషోత్తమరెడ్డి, ఫయాజ్‌అహ్మద్, సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో సత్ఫలితాలు

నల్లమాడ : సాంకేతిక విధానాలు, నవీన పద్ధతుల ద్వారా వ్యవసాయంలో సత్ఫలితాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఎద్దులవాండ్లపల్లి తండా రైతులు సాగు చేసిన వేరుశనగ పంట పొలాల్లో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీతో రైతు సంఘాలకు పురుగుల మందు పిచికారీ చేసే డ్రోన్లను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి చదివిన రైతులు డ్రోన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగానే డ్రోన్ల నిర్వహణ విధానంపై శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి వ్యవసాయంలో డ్రోన్ల నిర్వహణ పట్ల రైతులకు అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి, కదిరి వ్యవసాయ శాఖ ఎడిఎ సత్యనారాయణ, మండల ఎఒ సుమతి, మండల అగ్రిగోల్డ్ ఛైర్మన్ రఘునాథరెడ్డి, వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, రైతులు పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలోని మాల్యవంతం, కాటమకుంట, పోట్లమర్రి గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన కందిపంటలో అధికారులు సోమవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. మాల్యవంతం గ్రామంలో సర్వే నెంబర్ 366-2లో వెంకటనారాయణ పొలంలో, కాటమకుంటలోని సర్వే నెంబర్ 566-20లో బాల చంద్రారెడ్డి పొలంలో, పోట్లమర్రిలోని సర్వే నెంబర్ 597 - 2ఎలో ఆనంత పొలంలో 10ఐ10 మీటర్లు కొలతలో నిర్వహించినట్లు ఎఎస్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, ఎఇఒ వీరాంజనేయులు, వీఎస్ఏ లావణ్యలత, వీఏఏ చిగిచెర్ల నాగార్జున, వీఎస్ఏ ముత్యాలప్ప, ఎస్‌బిఐ బీమా జిల్లా కో ఆర్డినేటర్ షర్ఫుద్దీన్, రఫీ, శ్రీనివాసులు, ఆర్‌కె, వలంటీర్ పెద్దక్క, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే పనుల్లో పురోగతి

కలెక్టర్ బసంత్ కుమార్

వీడియో కాన్ఫిరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వారంలో మూడు రోజులు ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రగతి సాధించాలిని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం నుంచి 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ, హౌసింగ్, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ, హౌసింగ్, గడపగడపకు మన ప్రభుత్వం, స్పందన తదితర అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఇతర అధికారులతో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖతో కలిసి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్‌కి సంబంధించి ఉగాది నాటికి 10,750 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా జనవరి నెలకు కేటాయించిన లక్ష్యాన్ని ముందుగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణ పనులనూ వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీకి సంబంధించి లక్ష్యం మేరకు కూలీలు ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎంపిఎఫ్‌సి గోడౌన్‌లకు సంబంధించి జిల్లాలో మూడో దశలో మంజూరైన గోడౌన్‌లకు వచ్చే గురువారం నాటికి పెండింగ్ ఉన్న భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని తహశీల్దార్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో వస్తున్న స్పందన గ్రీవెన్స్ పరిష్కారంపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఆర్డీఏ పీడీ నరసయ్య, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, డిసిఒ కష్ణానాయక్, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకష్ణ, చేనేత జౌళి శాఖ ఎడి రమేష్, ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి, ఆరోగ్యశ్రీ అధికారి యల్లప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

గణతంత్ర్య దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

గణతంత్ర్య వేడుకలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 26న నిర్వహించే 74వ గణతంత్ర్య వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ వేడుకలను పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పతాక ఆవిష్కరణ, స్టాల్స్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. వీటి నిర్వహణకు వివిధ శాఖల జిల్లా అధికారులను నియమిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజలంతా ఏకమై జగన్‌కు బుద్ధి చెబుదాం..

'ఇదేం ఖర్మ'లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గోరంట్ల

రాష్ట్రంలో దౌర్జన్యపాలన అంతం కావాలంటే ప్రజలంతా ఏకమై వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే పార్థసారధి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గంగంపల్లి పంచాయతీలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రం రావణకాష్టంగా మార్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్లలో గ్రామాల అభివృద్ధి కుంటు పడిందన్నారు. అలాగే నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. మోసాలు, అబద్ధాలు, దౌర్జన్యాలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అయినా జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోమశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, హిందూపురం పార్లమెంటు కార్యదర్శి దేవా నరసింహులు, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు నీలకంఠారెడ్డి, చెరువుపల్లి శ్రీనివాసులు, రామస్వామి, నరసింహులు, విక్రమ్‌గౌడ్, బాలాజీ, బ్రహ్మయ్య, రుద్రప్ప, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

తలుపుల : మండల పరిధిలోని బల్లపల్లి పంచాయతీలో సోమవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాలతో బీసీ కాలనీ, దిగువ మాలపల్లి, నాగప్పగారిపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముబారక్, నాయకులు జయచంద్ర, గంగరాజు, చాంద్, రాధాకృష్ణ, బాబు, సిద్దేష్, రాజారెడ్డి, కొమ్మెర సీనా, మహేష్, అశోక్, మహేష్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న పార్థసారధి

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హమాలీ రాష్ట్ర యూనియన్ ఆదేశాల మేరకు జిల్లా కార్యదర్శి బి.నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పెరిగిన కూలి రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని, అరియర్స్ చెల్లించాలని, పిఎఫ్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, కొత్తవారి పేర్లను నమోదు చేయాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ నాయకులు బాబు, తిప్పన్న, రఫీక్, ఓబులేసు, హనుమంతు, సలీమ్ పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలో సివిల్ సప్లయ్ గోడౌన్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గోడౌన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హమాలీలు మాట్లాడుతూ పెరిగిన కూలి రేట్లు వెంటనే అమలు చేయాలని, పెరిగిన కూలి రేట్లకు అరియర్స్ చెల్లించాలని, పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని, కొత్తవారికి పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం హమాలీల సమస్యలు పరిష్కరించి పెంచిన కూలి రేట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేస్త్రి గంగాధర్, బాబావలి, అశోక్, వాసు, నాగేష్, నర్సింహులు, ముస్తఫా, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

పెనుకొండలో ఆందోళన చేస్తున్న హమాలీలు

వైసిపిని గద్దెదించినప్పుడే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో పేదరికాన్ని పెంచడంతోపాటు తెలుగు జాతిని విధ్వంసం చేస్తూ అరాచక పాలన సాగిస్తున్న వైసిపిని గద్దెదించినప్పుడే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సిఎంగా ప్రమాణస్వీకారం చేసి 40ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లుగా భావించి టిడిపిని స్థాపించిన 8 నెలల్లోనే అధికారంలోకి వచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. అంతేగాకుండా బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లు అమలు చేశారన్నారన్నారు. ముఖ్యంగా పేదవారికి పక్కా ఇళ్ల నిర్మాణం, రూ.2కే కిలో బియ్యం, వృద్ధులు, వితంతువులకు పెన్షన్, భూమిలేని నిరుపేదలకు భూ వసతి కల్పించడంతోపాటు, తెలుగు గంగా పథకానికి శ్రీకారం చుట్టి, భూమి శిస్తు రద్దు చేసి రూ.50కే హార్స్ పవర్ విద్యుత్ సౌకర్యం కల్పించారని గుర్తు చేశారు. అయితే నేడు జగన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో కోరికపోయిందన్నారు. తద్వారా పేదరికం పెరిగిందన్నారు. విద్యుత్తు ఆర్టీసీ చార్జీలు పెంచడంతోపాటు పన్నులు అధిక భారం వేసి ప్రజల సంపాదనను గుంజుతున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకెళ్తున్న చంద్రబాబు ద్వారానే పేదరికం లేని సమాజం, తెలుగుజాతి పునర్వైభవం సాధ్యమన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జీవన్‌జ్యోతి విద్యార్థిని

విద్యార్థిని అభినందిస్తున్న జీవన్‌జ్యోతి పాఠశాల హెచ్‌ఎం జాన్సియా

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు జీవన్‌జ్యోతి పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ జాన్సియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 30న పాల్గూరు జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో తమ పాఠశాలలో 8వతరగతి చదువుతున్న సాయిభవిత అండర్-14 రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈమేరకు విద్యార్థినిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

రొద్దం: మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప అనారోగ్యంతో సోమవారం మృతిచెందడంతో తెలుగు యువత నాయకులు ఆర్థికసాయం అందజేశారు. మృతిచెందిన విషయం తెలుసుకున్న పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు ఇని హరీష్ కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

లేపాక్షి : మండల పరిధిలోని కొండూరు గ్రామంలో వెలసిన శ్రీసప్తలమ్మ తల్లి దేవస్థాన అభివృద్ధి కోసం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కొండూరు మల్లికార్జునస్వామి సోమవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి శివప్ప, నాయకులు మద్దాల ప్రసాద్, పూల శీనప్ప, కె.అశ్వర్థప్ప, రామాంజి, ఆదినారాయణ, హనుమంతరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గాండ్లపెంట : మండల కేంద్రంలోని ఆంజనేయశెట్టి కాలనీలో సోమవారం నూతనంగా బోరు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపిపి తాతం జగన్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపిపి నిధులు మంజూరు చేయడంతో నూతన బోరు వేయగా నీరు పుష్కలంగా పడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.అంజనప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్ అలీ, మాజీ జెడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఐక్యత అధ్యక్షుడు ఎ.నర్సింలు, ఎంపిటిసి పామిడి కమర్తహాన్, సర్పంచి రహమతుల్లా, వైసిపి నాయకులు పామిడి మహముద్ జక్కర్, రవీంద్రరెడ్డి, మైనుద్దీన్, ఎన్‌వి సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక బడ్జెట్ సమావేశం

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 11న బుధవారం 2023-24 ప్రత్యేక బడ్జెట్‌పై సమావేశం నిర్వహించనున్నట్లు ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, కమిషనర్ మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలన్నారు. ధర్మవరం మున్సిపాలిటీ 2022-23 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2023-24 సంవత్సరానికి తయారు చేసిన అంచనాలు వంటి వాటిపై కౌన్సిల్‌లో ఆమోదంపై సమావేశం ఉంటుందన్నారు.

In the court of the Senior Civil Judge, Penukonda
I.A.No: 409/2021 in O.S.No:15/2002
Between:
Krishnammagiri Ademma ...**Petitioner/plaintiff**
And
Kana Aswartha narayana and Others
...**Respondent/Defendant**
పై నెంబరు దావాలోని I.A.409/21 లో 8వ ప్రతివాదికి నోటీసు
To
R8: Bhargava Simha S/o Veena Jayakara Rao, Puttaparthi, Puttaparthy Mandal.
ఇందుమూలముగా నీకు తెలియజేయడమేమనగా పై నెంబరు దావాలోని I.A.409/2021 లోని షెడ్యూలు దాఖలా ఆస్తులు విభజించుటకు గాను అడ్వకేటు కమిషనర్‌ను నియమించుటకు గాను అర్జీ దాఖలు చేసినారు. సదరి విషయములైన మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్న యెడల మీరు 23-01-2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో ఖుద్దున గాని వకీలు ద్వారా గానీ హాజరై మీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెయున. లేని యెడల మీ పరోక్షమందు అర్జీని తీర్మానముచేయుదురని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
(By order of the court)
ఆర్.శ్రీకాంత్ రెడ్డి
అర్జీదారుపరం వకీలు, పెనుకొండ

In the court of the Senior Civil Judge, Penukonda
O.S.No:57/2017
Between:
Jagga sreenivasulu ...**plaintiff**
And
Jagga Narasimhulu and Others ...**Defendants**
పై నెంబరు దావాలోని 21 నుండి 24 ప్రతివాదులకు దావా సమన్లు
To
D21: Jagga Chandrakala W/o Jagga Narasimhulu
D22: Kantham Gayathti W/o K.Vishnu vardhan, D/o Jagga Narasimhulu
D23: Jagga Mounika D/o Jagga Narasimhulu
D24: Jagga Sai Sivaram S/o Jagga Narasimhulu
The Defendents 21 To 24 are residing at D.No.27/1881 opposite to Pothukuntagates, Now Near Anjaneya Swamy Temple, Dharmavaram.
ఇందుమూలముగా నీకు తెలియజేయడమేమనగా పై దావాలోని వాది షెడ్యూలు దాఖలా ఆస్తులు విభాగములకు గాను పై దావాను దాఖలు చేసినాడు. సదరి విషయములై మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్న యెడల మీరు పై కోర్టులో 18-01-2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గాని వకీలు ద్వారా గానీ హాజరై మీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెయున. లేని యెడల మీ పరోక్షమందు పై దావాను తీర్మానముచేయుదురని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
(By order of the court)
ఆర్.శ్రీకాంత్ రెడ్డి
అర్జీదారుపరం వకీలు, పెనుకొండ

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రూపొందించిన నూతన డైరీ, క్యాలెండర్లను సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తయారు చేసిన డైరీలో ఉపాధ్యాయులు, విద్యాశాఖకు సంబంధించిన అన్ని రకాల వివరాలను పొందుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సిద్ధగిరి శ్రీనివాసులు, ఎంజిఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రయివేట్ పాఠశాలల సంఘం (అపుస్మా) నూతన సంవత్సర క్యాలెండర్లను జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి స్థానిక డిఇఒ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి రియాజ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ముస్తఫా అలీఖాన్, ఎల్ఆర్‌జి విద్యాలయం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం పట్టణంలోని రెడ్డి జెఎసి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి, డాక్టర్ ఆశ్వర్థరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులు వెంకటేష్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నాగభూషణ్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినులకు మోడల్ పేపర్స్ పంపిణీ

విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఇఒ ఎస్ఐ, యుటిఎఫ్ నాయకులు

ధర్మవరం టౌన్ : మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలోసోమవారం మోడల్ పేపర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ సుధాకర్‌నాయక్, రూరల్ ఎస్ఐ ప్రదీపకుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఓబుళనాయునిపల్లి గంగాధర్ మాట్లాడుతూ ఈపుస్తకాలు విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థినులు భవిష్యత్తులో మంచిస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎ.చంద్రకళ, యుటిఎఫ్ నాయకులు ఆదిరెడ్డి, జనార్ధన్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

బత్తలపల్లి : మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త, ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ కోటి సుధ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి ఓంకారేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగానందాచారి, బిల్లే సూరి, కోటి అంజలీతోపాటు పలువురు శివమాల దీక్షాపరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ధర్మవరం టౌన్ : మండలంలోని చిగిచెర్ల గ్రామంలో కిమ్స్ సవేరా అసుపత్రి, కంపాషన్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వైద్యశిబిరంలో సవేరా ఆసుపత్రి వైద్యసిబ్బంది ప్రజలకు జిఆర్‌బిఎస్, బీపీ, ఇసీజీ, 2డిఎకో పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబయ్య, రమణారెడ్డి, పార్థారెడ్డి, ఛారిటబుల్ ట్రస్టు మేనేజర్స్ రాజుకుమార్, ఓబుళపతి, రామాంజినేయులు, రామకష్ణ, నల్లప్ప, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా అందించాలని ఏఐఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జగనన్న గోరుముద్ద అంటూ ముద్దుగా పేరు పెట్టారని, అయితే భోజనంలో ఎలాంటి నాణ్యత లేదన్నారు. ఉడికీ ఉడకని అన్నం, చెడిపోయిన గుడ్లను అందిస్తున్నారన్నారు. గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, జిల్లా నాయకులు హరికృష్ణ, ఆనంద్, ఆంజనేయులు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు పోరాటం

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములుయాదవ్

ప్రజాశక్తి-పెనుకొండ

నియామకపత్రం అందుకుంటున్న బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములుయాదవ్

బిసిల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధనకు రానున్న రోజుల్లో పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములుయాదవ్ తెలిపారు. విజయవాడలో ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా పెనుకొండకు చెందిన శ్రీరాములు యాదవ్‌ను నియమించడంతో రాష్ట్ర అధ్యక్షుడు నాకా వెంగళరావుయాదవ్‌తో సోమవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో విద్యార్థి, ఉద్యోగ, మహిళా కమిటీలను ఏర్పాటు చేసి బిసిల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల సాధన కోసం పోరాటం ఉధతం చేస్తామన్నారు. అలాగే రాజకీయంగా బీసీల్లో ఉండే అన్నికులాలను కలుపుకుని రాజకీయ చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం జిల్లా ప్రతినిధులు చక్రధర్‌యాదవ్, బాలాంజినేయులు, మంజునాథ్ , పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తలుపుల

ప్రజాశక్తి క్యాలెంటర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

మండలంలోని కొక్కంటి క్రాస్‌లో తెలుగుదేశం నాయకులు, సర్పంచులు సోమవారం ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాశక్తి దినపత్రిక కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బాలసముద్రం సర్పంచి బుగిడే జయమ్మ, గేమేనాయక్‌తండా సర్పంచి కాంతమ్మ, సీనియర్ నాయకులు సోంపాల్యం నాగభూషణ, బుగిడి చంద్ర, పీజీ మల్లికార్జున, వార్డు మెంబర్ దామోదర్, జియాఉల్లా ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో సిఐటియు అనుబంధ ఆశా కార్యకర్తలు సోమవారం ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ముందు వరుసలో ఉండి ప్రజలకు సేవలు చేసిన ఆశాకార్యకర్తల సమస్యలు గుర్తించి అనేక కథనాలు ప్రచురించిన ప్రజాశక్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాకుండా ప్రజలు, కార్మికుల పక్షాన ఎప్పుడూ ముందు ఉండి వారి సమస్యలకు పరిష్కారం చూసే విధంగా ఎనలేని కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కాంతమ్మ, నారాయణమ్మ, మున్ని, వెంకటేశ్వరమ్మ, సావిత్రి, భారతి, రమణమ్మ ప్రజాశక్తి విలేకరి వేంపల్లి బాదుల్లా పాల్గొన్నారు.

మారని దళితుల తలరాతలు

ప్రజాశక్తి-పెనుకొండ

సచివాలయ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు, దళితులు

ప్రభుత్వాలు మారుతున్నా దళితుల తలరాతలు మారడం లేదని కెవిపిఎస్ జిల్లా నాయకులు రమేష్ అన్నారు. దళితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి-4వ సచివాలయంలో వీఆర్వో ఓబులేసు, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్‌కి కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా నేటికీ దళితులపై వివక్ష, అంటరానితనం కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా దళితులకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, శ్మశాన వాటిక స్థలంలో ప్రహరీలు నిర్మించాలని, నీటి తొట్టి, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రం నాయకులు ఓట్ల కోసం వచ్చి మభ్యపెట్టి ఓట్లు దండుకుని గద్దెనెక్కిన తర్వాత విస్మరిస్తున్నారన్నారు. జీవో 12, 35 ప్రకారం దళితుల శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు రమేష్, మండల నాయకులు తిప్పన్న, బాబు రామంజి, అంజి, ముత్యాలు, అశ్వత, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో 'మనూస్' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రస్థాయి డాన్స్ పోటీల్లో కదిరికి చెందిన మనూస్ డాన్స్ అకాడమీ విద్యార్థులు విజయం సాధించినట్లు అకాడమీ మాస్టర్ తేపల్లె మనోజ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక అకాడమీలో గెలుపొందిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లులోని రైల్వేగ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి డాన్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈపోటీల్లో న్యాయ నిర్ణేతగా ఢీ-15 షో ప్రముఖ కొరియోగ్రాఫర్ మణికంఠ మాస్టర్ హాజరైనట్లు తెలిపారు. ఈపోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందల మంది డాన్సర్లు పాల్గొనగా జూనియర్ గ్రూప్ విభాగంలో కదిరికి చెందిన మనూస్ డాన్స్ అకాడమీ నుంచి జూనియర్ సోలో విభాగంలో లలితాదిత్య, జూనియర్ గ్రూప్ విభాగంలో చరణ్, రోషన్, హేమశ్రీ, షరణి, చర్విత, జయశ్రీ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనూస్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్లు డాక్టర్ తెపల్లె మనోహర్, వినోద్, ట్రైనర్స్ ప్రవీణ్, తనూజ్ పాల్గొన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకోవాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి సమీపంలోని ఎనుములపల్లి శ్మశాన వాటిక దగ్గర చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఎనుములపల్లికి చెందిన చెరువు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు సోమవారం తహశీల్దార్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి ఎనుములపల్లి శ్మశాన వాటికలో పెద్ద యంత్రాలు (పడవలు సాండ్ సుకింగ్ మిషన్స్) ఏర్పాటు చేసుకుని ఇసుకను తరలించడానికి ప్రయత్నించగా ఎనుములపల్లి, రాయలవారిపల్లి, గోకులం, రైతులు అడ్డుకోవడంతో ఆదివారం భూగర్భ గనుల శాఖ అధికారులు, తహశీల్దార్ వచ్చి పరిశీలించారన్నారు. కావున రాయలవారిపల్లి బ్రిడ్జికి 15 కిలోమీటర్ల దూరంలో రీడింగ్ వచ్చినదని, దీన్ని బట్టి ఈ రీచ్ అక్రమమని, వెంటనే రీచ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

బడుగుల ఆశాజ్యోతి ఎన్టీఆర్

ప్రజాశక్తి-బుక్కపట్నం

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని టిడిపి సీనియర్ నాయకులు పెదరాసు సుబ్రహ్మణ్యం కొనియాడారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపిని స్థాపించిన 9 నెలలోనే అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన ఘనడు ఎన్టీఆర్ అన్నారు. అంతేగాకుండా సిఎంగా పేదలకు ఎన్నో సంక్షేమ పథకాల ప్రవేశపెట్టి ప్రజా రంజక పాలన సాగించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించారని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అగ్రహారం వారాదప్ప, లక్ష్మీనారాయణ, బోడపాటి నారాయణస్వామి, చిన్నమనాయుడు, శంకర, మంజునాథ్, నాగరాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బిసి బాలుర వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి-నల్లచెరువు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిపి రమణారెడ్డి

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాని ఎంపిపి రమణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వసతి గృహంలో పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నారాయణస్వామి, వార్డెన్ లక్ష్మీనారాయణ, గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జడ్పిటిసి కుర్లి దామోదర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పోలప్ప ఆధ్వర్యంలో ఎంపిపి తుమ్మల పర్వీన్ భాను అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి ప్రజల మన్ననలు పొందాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంపిపి తుమ్మల పర్వీన్‌భాను మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వం అందించే పథకాలను గ్రామస్థాయిలో ఎంపిటిసిలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులకు వివరించి సంపూర్ణంగా ప్రజలకు చేరవేయడానికి అధికారులు చిత్తశుద్ధిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, ఎంఇఒ ఖాదర్ వలిబాషా, విద్యుత్ శాఖ ఎఇ రామసూరారెడ్డి, వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, హౌసింగ్ ఎఇ హరిప్రసాద్‌రెడ్డి, అగ్రికల్చర్ ఎఒ ఇలియాజ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, ఐకెపి ఎపిఎం రమణప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాసులు, సర్పంచులు ముద్దలపల్లి గోవింద్, జగన్మోహన్‌చౌదరి, రంగారెడ్డి, వెంకటరమణ, రామచంద్రారెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

నేరాలు ఘోరాలు

తెగిపడిన 11కెవి విద్యుత్ లైను..

తెగి కింద పడిన విద్యుత్ లైన్

మడకశిర : పట్టణ పరిధిలోని బేగార్లపల్లి ఎవిఎస్ గార్మెంట్స్ సమీపంలో సోమవారం ఉదయం 11 కెవి విద్యుత్ లైను తెగి కింద పడింది. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణ సమీపంలోని బేగార్లపల్లి వద్ద ఉన్న ఎవిఎస్ గార్మెంట్స్ నుంచి కొద్ది దూరం వెళ్లిన తర్వాత విద్యుత్ స్తంభం నుంచి 11 కేవీ విద్యుత్ లైను తీగ ఉన్నఫలంగా తెగిపడింది. మడకశిర నుంచి అమరాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెళ్లిన తర్వాత విద్యుత్ తీగ తెగి కింద పడిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ తీగ కింద పడటంతో దాదాపు అరగంటకుపైగా మడకశిర, గుడిబండ అమరాపురం ప్రాంతాలకు వెళ్లే ప్రజలు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. వెంటనే స్థానికులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో హుటాహుటిన వారు ఘటనా స్థలానికి చేరుకుని తెగిన విద్యుత్ తీగలకు మరమ్మతులు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రధాన రహదారుల వద్ద ప్రమాదస్థితిలో ఉంటున్న వాటిని ముందస్తుగా గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

లేపాక్షి : మండలం పరిధిలోని కంచి సముద్రం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ ధనుంజయ్ తెలిపారు. ఇందులో 336 ప్యాకెట్లు, 90 ఎంఎల్, 20 ప్యాకెట్లు, 180 ఎంఎల్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని బిసలమాన్‌పల్లికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు టిప్పర్లు ఢీ-డ్రైవర్‌కు గాయాలు

బత్తలపల్లి : బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై సోమవారం రెండు టిప్పర్లు ఢీకొన్నాయి. దీంతో టిప్పర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం ఇసుక రీచ్ నుంచి ధర్మవరానికి ఇసుకను తీసుకెళ్లి తిరిగి వస్తున్న రెండు టిప్పర్లు బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెనుక వస్తున్న టిప్పర్ డ్రైవర్ నాగరాజు (బత్తలపల్లి మండలం సూర్యచంద్రాపురం) టిప్పర్‌లోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు డ్రైవర్‌ను కాపాడేందుకు తీవ్రంగా శ్రమించారు. ఇంతలో ఎఎస్ఐ సోమశేఖరమూర్తి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జెసిబి సాయంతో బయటకు తీసి 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

ధర్మవరం టౌన్ : ప్రతి విద్యార్థి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు, చికాగోలో వివేకానందుడి ఉపన్యాసంపై పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, యోగా అసోసియేషన్ అర్గనైజర్ నరసింహులు, రామన్న, యోగా మాస్టర్, ఉపాధ్యాయురాలు సునీత పాల్గొన్నారు.

ఎఐఎస్‌ఎఫ్ నూతన కమిటీ ఎంపిక

ధర్మవరం టౌన్ : ఎంఎస్‌ఎఫ్ నూతన పట్టణ కమిటీని జిల్లా అధ్యక్షుడు సకల రాజ అధ్వర్యంలో సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎంపిక చేశారు. పట్టణ అధ్యక్షుడిగా రవి, కార్యదర్శిగా శంకర్, సహాయ కార్యదర్శి సుభహాన్, ఉపాధ్యక్షుడిగా మారితోపాటు మరికొంతమందిని కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

విధుల్లో చేరిన 'పురం' మున్సిపల్ కమిషనర్

హిందూపురం : హిందూపురం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు సోమవారం విధుల్లో చేరారు. ఈయన కొన్ని రోజుల నుంచి సెలవులో ఉన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సెలవులు పూర్తి కావడంతో తిరిగి సోమవారం విధుల్లో చేరారు.

కోడిపందేలు ఆడొద్దు..

కదిరిటౌన్ : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవని రూరల్ సిఐ సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి రూరల్ మండలంలో ప్రజలు కోడిపందేలుగానీ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తలుపుల : ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు మున్వర్ బాషా, రోజా దాదాపు 58 మంది గర్భిణులను పరీక్షించి 29 మందిని హైరిస్క్ గర్భవతులుగా గుర్తించారు. 12 మందిని రక్త హీనత ఉన్న గర్భవతులను గుర్తించి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్స్ ఇచ్చారు. మరో 11 మందిని ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం కదిరికి పంపారు. అనంతరం హైరిస్క్ ఉన్న గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రతలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. కాగా పుట్టపర్తిలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న తలుపుల వాసి గంగిశెట్టి రోగులకు అన్నదానం చేశారు.

పులమితి పంచాయతీ కార్యాలయం తనిఖీ

లేపాక్షి : మండలం పరిధిలోని పులమితి పంచాయతీ కేంద్రాన్ని డిఎల్‌పిఒ బాలాజీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 26లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను పరిశీలించి సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనుమతులు లేని వాటిని 15రోజుల్లోపు తొలగించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో ప్రభుత్వం భూమి ఎంత ఉంది, ప్రయివేటు భూమి ఎంద ఉందో వివరాలు తెలియజేయాలని కోరారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ప్రతిభా కనబర్చిన విద్యార్థులు

హిందూపురం : బెంగళూరులో జరిగిన డి క్యూబ్ స్పోర్ట్స్ క్లబ్ వారు శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హిందూపురం నుంచి విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. ఈమేరకు సోమవారం విజేతలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో ఆలియా ప్రథమ స్థానం, సాజీద్ ద్వితీయ స్థానం, తన్నులో జాన్ విక్టర్ తృతీయ స్థానం, సజ్జాద్ ప్రతిభ చాటారన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి మెమొంటో, ప్రశంసాపత్రాలు అందించారన్నారు.